

మామిడి రైతు దిగాలు

వాతావరణ మార్పులు ఫలరాజుపై పగబట్టాయి. డిసెంబర్‌లో మొదలైన చలి, సంక్రాంతి వరకు చుట్టుముట్టే పొగమంచు మామిడి తోటలపై తీవ్ర ప్రభావం చూపనున్నాయి. -8లో



ఎర్రచందనం దుంగలు స్వాధీనం

పాలకొండలు ప్రాంతంలోని కోర్తిపెంట వద్ద అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉంచిన ఎర్రచందనం దుంగలను అటవీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.190	రూ.260
రెండోరకం	రూ.100	రూ.186



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 267 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	456	475
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 1054.600 కిలోలు

న్యూస్‌రీల్

నూతన నియామకం



చరణ్‌కుమార్‌రెడ్డి

బద్వేలు అర్బన్ : రెడ్డి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ(ఆర్‌సీడీఎస్) రాష్ట్ర యూత్ వింగ్ అధ్యక్షుడుగా బద్వేలు మండలం కొంగలవీడు గ్రామానికి చెందిన కాకర్ల చరణ్‌కుమార్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యర్రపురెడ్డి సురేంద్రరెడ్డి నుంచి బుధవారం నియామకపత్రం అందింది.

'ఓపెన్ స్కూల్' ఫీజులు చెల్లించాలి

కడప ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం(ఓపెన్ స్కూల్) నిర్వహించే పది, ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన పరీక్ష ఫీజును జనవరి 19వ తేదీలోపు చెల్లించాలని జిల్లావిద్యాశాఖ అధికారి ఎద్దుల రాఘవరెడ్డి, ఓపెన్ స్కూల్ జిల్లా కో–ఆర్డినేటర్ కేవీ సుబ్బారెడ్డిలు మంగళవారం తెలిపారు. మార్చి 18 నుంచి 27వ తేదీ వరకు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్ర 5.30 గంటల వరకు పరీక్షలుంటాయన్నారు. వీటి ఫీజును జనవరి 19వ తేదీ లోపు చెల్లించాలన్నారు. అలాగే రూ.25 అపరాధ రుసుముతో జనవరి 20 నుంచి 27వ తేదీ వరకు, రూ.50 అపరాధ రుసుముతో జనవరి 28 నుంచి ఫిబ్రవరి 9వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. తత్కాల్ రుసుముతో పదో తరగతికి రూ.500, ఇంటర్‌కు రూ.1000తో పాటు ఆయా సబ్జెక్టులకు నిర్దేశిత పరీక్ష ఫీజును ఏపీ ఆన్‌లైన్, ఏపీఓఎస్ఎస్ ఆన్‌లైన్ పేమెంట్ గేట్‌వే ద్వారా చెల్లించాలని వారు సూచించారు.

నిబంధనల మేరకు విధులు



మాట్లాడుతున్న వెంకట రమణారెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్: జిల్లాలోని గ్రామీణ సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు నిబంధనల మేరకు విధులు నిర్వర్తించాలని జిల్లా పరిషత్ ఉప ముఖ్య కార్యనిర్వహణాధికారి వెంకట రమణారెడ్డి సూచించారు. కడప నగరంలోని నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్‌లో సచివాలయ ఉద్యోగుల మూడో బ్యాచ్ శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథి వెంకట రమణారెడ్డి మాట్లాడుతూ శిక్షణ కాలంలో నైపుణ్యాలను అభివృద్ధి చేసుకొని ప్రజలకు మెరుగైన సేవలందించాలన్నారు. జిల్లా గ్రామ, వార్డు సచివాలయ కార్యాలయ పరిపాలన అధికారి రామకృష్ణయ్య మాట్లాడుతూ సమస్యలను సహృదయంతో అర్థం చేసుకుని పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఇంతియాజ్ అహ్మద్ ,రీజనల్ కో–ఆర్డినేటర్ సుబ్బరామిరెడ్డి పాల్గొన్నారు.

బడుగులకు సాధికారం

- రాజ్యాధికారంలో భాగస్వామ్యం.. సంక్షేమంలో అగ్రపీఠం
- వైఎస్ జగన్ సర్కార్‌లో బడుగు, బలహీన వర్గాల ఉన్నతికి పెద్దపీట
- ఆచరణలో సామాజిక న్యాయం చూపెట్టిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్
- రాయచోటి నియోజకవర్గంలో డీబీటీ ద్వారా రూ. 934 కోట్లు, నాన్ డీబీటీ ద్వారా రూ. 355 కోట్ల ప్రయోజనం
- నేడు రాయచోటిలో సామాజిక సాధికార బస్సు యాత్ర



సాక్షి రాయచోటి : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అట్టడుగు వర్గాలకు అగ్రపీఠం దక్కింది. అగ్రవర్ణాలతో సమానంగా బలహీన వర్గాలు కూడా రాణించాలన్న సమున్నత సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వారికి పెద్దపీట వేశారు. సమాజంలో అందరికంటే ఎక్కువగా సంక్షేమంతోపాటు సామాజిక న్యాయం జరగాలని సంకల్పించారు. ఓ వైపు సంక్షేమాన్ని అందిస్తూనే...మరోవైపు రాజ్యాధికారంలో వారికి భాగస్వామ్యం కల్పించి బడుగు, బలహీన వర్గాల గుండెల్లో వైఎస్ జగన్ చిరస్మరణీయమైన ముద్ర వేసుకున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు దశాబ్దాల చరిత్రలో ఏ ప్రభుత్వం చేయనంత మంచి ప్రయోజనాన్ని వారికి అందించారు.

నాడు..నేడు ఎంతో తేడా

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పాలనలో బడుగు బలహీన వర్గాలకు అగ్ర తాంబూలం అందించారు. ఇదివరకు ఆయా పార్టీలు, నేతలు మాటలకే పరిమితం చేస్తే వైఎస్ జగన్ చేతల్లో చూపించారు. రాజ్యాధికారంలో వారే కీలకమంటూ అన్ని విధాలుగా వారిని అందలం ఎక్కించారు. రాజకీయ పదవులతోపాటు ఇతర నామినేటెడ్, కార్పొరేషన్ పదవులు, సంక్షేమ పథకాలు ఇలా చెబుతూ పోతే ప్రత్యేకంగా అణగారిన వర్గాలకు పెద్దపీట వేస్తున్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నంత సేపు వెనుకబడిన వర్గాల ఓట్ల కోసం ఆసక్తి చూపించిందే తప్ప పూర్తి స్థాయిలో వారి ఆర్థిక భద్రతకు చర్యలు తీసుకున్న పాపాన పోలేదు. అందుకే ఎక్కడ చూసినా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు వైఎస్సార్ సీపీకి బ్రహ్మరథం పడుతున్నారు.

నేడు రాయచోటిలో సామాజిక సాధికారిక బస్సు యాత్ర

అన్నమయ్య జిల్లా రాయచోటిలో గురువారం మధ్యాహ్నం సామాజిక సాధికార బస్సు యాత్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి నేతృత్వంలో జరుగుతున్న ఈ కార్యక్రమానికి పలువురు మంత్రులతో పాటు ఇతర రాష్ట్ర స్థాయి నాయకులు హాజరవుతున్నారు. మధ్యాహ్నం 1.30 గంటలకు రింగ్‌రోడ్డు నుంచి ర్యాలీ ప్రారంభమై బంగ్లా వరకు కొనసాగనుంది. అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగసభలో ప్రజలనుద్దేశించి ప్రజాప్రతినిధులు, నేతలు మాట్లాడనున్నారు. అందుకు సంబంధించి ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు.

రాయచోటి నియోజకవర్గానికి రూ. వేల కోట్ల ప్రయోజనం



అన్నమయ్య జిల్లాకు సంబంధించి రాయచోటి నియోజకవర్గంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల పరంగా ప్రభుత్వం భారీగా నిధులను ఖర్చుచేసింది. ఒక్క రాయచోటి నియోజకవర్గానికే డీబీటీ ద్వారా రూ. 934 కోట్లు, నాన్ డీబీటీ కింద రూ. 355 కోట్లు ఖర్చు చేశారు. ఇందులో బీసీలకు డీబీటీ కింద రూ. 695 కోట్లు, నాన్ డీబీటీ కింద రూ. 272 కోట్లు కలిపి మొత్తం రూ. 967 కోట్లు అందింది. అలాగే ఎస్సీలకు డీబీటీ ద్వారా రూ. 140 కోట్లు, నాన్ డీబీటీ ద్వారా రూ. 45 కోట్లు కలిపి మొత్తం రూ. 185 కోట్ల మేర లబ్ధి చేకూరింది. అలాగే ఎస్టీలకు డీబీటీ ద్వారా రూ. 65 కోట్లు, నాన్ డీబీటీ ద్వారా రూ. 27 కోట్లు కలిపి రూ. 92 కోట్ల ప్రయోజనాన్ని అందించారు. అలాగే మైనార్టీలకు సంబంధించి డీబీటీ ద్వారా రూ. 65 కోట్లు, నాన్ డీబీటీ ద్వారా రూ. 27 కోట్లు కలిపి రూ. 92 కోట్ల లబ్ధిని ప్రభుత్వం చేకూర్చింది.

రాజకీయ పదవుల్లోనూ పెద్దపీట

రాయచోటి పట్టణం మైనార్టీ వర్గానికి చెందిన జకియాఖానమ్‌కు ఎమ్మెల్సీ పదవి ఇవ్వడంతోపాటు శాసనమండలి డిప్యూటీ చైర్ పర్సన్‌గా నియమించారు. అలాగే రాయచోటి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ పదవులనుకూడా ముస్లిం మైనార్టీలకు కేటాయించారు. అంతేకాకుండా ఆస్పత్రి అభివృద్ధి కమిటీతోపాటు మార్కెట్‌యార్డు చైర్మన్ పదవిని బీసీలకు కట్టబెట్టారు. లక్కిరెడ్డిపల్లె, గాలివీడు,రామాపురం, చిన్నమండెం మండలాల్లోని పలువురు ప్రజాప్రతినిధులకు మండల స్థాయి పదవులతోపాటు కార్పొరేషన్లకు సంబంధించి రాష్ట్ర డైరెక్టర్ల పదవులను కూడా ఆయా వర్గాలకు ప్రాధాన్యతను ప్రభుత్వం కల్పించింది.

జయప్రదం చేయాలి

వైఎస్ఆర్‌సీపీ సామాజిక సాధికారిక బస్ యాత్రలో బడుగు, బలహీన, మైనార్టీ వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. కేబినెట్‌లో బీసీ, ఎస్సీ, మైనార్టీలకు పెద్దపీట వేశామన్నారు. రాజ్యాంగ పదవులైన ఎమ్మెల్సీలలో, కార్పొరేషన్లలో, మేయర్ల స్థానంలో, మునిసిపల్ చైర్మన్‌ల స్థానంలో అందరికీ సామాజిక న్యాయం చేశామని గుర్తు చేశారు. వివిధ సంక్షేమ కార్యక్రమాల ద్వారా రెండు లక్షల కోట్ల రూపాయలు దాదాపుగా 80 శాతం సామాజిక వర్గానికి నేరుగా చేర్పించడం అంటే సామాన్య విషయం కాదన్నారు. జగన్ చేస్తున్న మంచికి ప్రచారం రాకూడదని స్వార్థ రాజకీయాల కోసం ఎజెండాలు పట్టుకొని అనునిత్యం జగన్‌పై బురదజల్లేందుకు దుష్టశక్తులు కుట్ర పన్నుతున్నాయన్నారు. దుష్ట శక్తుల్ని తరిమికొట్టడానికి రాయచోటిలో సామాజిక సాధికార బస్సుయాత్ర జరగనుందన్నారు. బస్సుయాత్రను ఆదరించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

యాత్రకు సర్వం సిద్ధం



రాయచోటి పట్టణంలో సాధికార యాత్ర సందర్భంగా వెలసిన బ్యానర్లు, పోస్టర్లు

రాయచోటి: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తోన్న మేలును వివరించడానికి వైఎస్ఆర్‌సీపీ చేపట్టిన సామాజిక సాధికార బస్సుయాత్రకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. గురువారం అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి నియోజకవర్గ పరిధిలో జరగనుంది. ఈ బస్‌యాత్రలో అంజద్‌బాషా, అనిల్ యాదవ్, విడదల రజని, మేరుగ నాగార్జున, నందిగాం సురేష్ తదితర నేతలు పాల్గొననున్నారు.

షెడ్యూల్ ఇలా..

- మధ్యాహ్నం 11.30కు రాయచోటి పట్టణంలోని అభి కళ్యాణ మండపంలో ప్రెస్‌మీట్
- మధ్యాహ్నం 1.00కు అభి కళ్యాణ మండపం నుంచి చెక్‌పోస్ట్ శివాలయం వరకు బస్‌యాత్రకు సంఘీభావంగా బైక్ ర్యాలీ
- మధ్యాహ్నం 1.30కు శివాలయం నుంచి బంగ్లా వరకు బస్‌యాత్రకు సంఘీభావ పాదయాత్ర
- మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు బంగ్లా సర్కిల్(నేతాజీ సర్కిల్)లో భారీ బహిరంగసభ

వారం రోజులుగా చైతన్య యాత్రలు..

సామాజిక సాధికారిక బస్‌యాత్ర విజయవంతానికి వారం రోజులుగా ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి మండలాల వారీగా కార్యకర్తలు, నాయకులతో ఆత్మీయ సమావేశాలు నిర్వహించి చైతన్యం చేశారు. ఈ సమావేశాలు విజయవంతంగా జరిగాయి. బస్‌యాత్రను జయప్రదం చేసేందుకు బడుగు, బలహీన, మైనార్టీ వర్గాలవారు ఉత్సాహంగా ఉన్నారు.

ప్రత్యేక శోభను సంతరించుకున్న రాయచోటి

బస్ యాత్ర సందర్భంగా పట్టణంలోని ప్రధాన రహదారులలో స్వాగత ఫ్లెక్సీల ఏర్పాటుతో నూతన శోభ సంతరించుకుంది. బస్ యాత్రకు రానున్న ప్రజలందరికీ భోజనం, తాగునీరు వసతులను ఏర్పాటు చేస్తున్నారు.

గర్భిణీలకు ఇబ్బందులు లేకుండా చూడాలి

రాయచోటి: గర్భిణీలకు, బాలింతలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూడాలని.. వైద్య సంబంధిత సేవల కోసం గ్రామాల్లోని ఆరోగ్య వైద్యశాల, ఫ్యామిలీ డాక్టర్ తదితర ప్రత్యామ్నాయాలను ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ గిరీషా పీఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గర్భిణీలకు, బాలింతలకు పోషకాహార అవసరాలు తీర్చేందుకు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని ఐసీడీఎస్ అధికారులను ఆదేశించారు. అంతకుముందు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పూనం మాలకొండయ్య అంగన్వాడీల సమ్మె నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యల గురించి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో డీఆర్ఓ సత్యనారాయణ, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

బిల్లుల ఆన్‌లైన్‌లో అలసత్వం వద్దు

- జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్
- రూ. 10 కోట్లతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులపై సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి: అన్నమయ్య జిల్లాలో ఎంపీ లాడ్స్ నిధులు రూ. 10కోట్లతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులను పీఎఫ్ఎంఎస్‌లో వెంటనే ఆన్‌లైన్ చేయాలని.. ఇందులో అలసత్వం చేయవద్దని కలెక్టర్ గిరీషా పీఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీసీ హాల్‌లో ఎంపీ లాడ్స్ నిధులతో జిల్లాలో చేపట్టిన పనుల పురోగతిపై సీపీఓ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్, ఇరిగేషన్, మున్సిపల్, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ లాడ్స్ నిధులతో ఆయా శాఖలు ద్వారా జిల్లాలో చేపట్టిన పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో ఎంపీ లాడ్స్ నిధులతో ప్రణాళిక ప్రకారం ప్రాధాన్యత పనులను చేపట్టడం జరిగిందన్నారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాల్సిన బాధ్యత ఆయా శాఖల అధికారులపై ఉందన్నారు. పనులు పూర్తిలో, నాణ్యతలో ఎక్కడా రాజీపడరాదన్నారు. ఎక్కడైనా సమస్యలు ఉంటే ఉన్నతస్థాయి అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ సమావేశంలో సీపీఓ కృష్ణా నాయక్, ప్లానింగ్ శాఖ ఏడీ వెంకట్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ ప్రసన్న కుమార్, జిల్లా పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారి చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా ఇరిగేషన్ అధికారి, రాయచోటి, మదనపల్లి, బి కొత్తపేట, మున్సిపల్ కమీషనర్లు, ఆయా ఇంజనీరింగ్ శాఖల ఈఈలు, జేఈలు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉర్దూ సంచార రథం రాక

కడప ఎడ్యుకేషన్: న్యూఢిల్లీ నేషనల్ కౌన్సిల్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఉర్దూ లాంగ్వేజ్ వారి ప్రచార, సంచార గ్రంథాలయ రథం 28వ తేదీ గురువారం కడపకు రానున్నదని రాయలసీమ ఉర్దూ రచయితల సమాఖ్య ప్రధాన కార్యదర్శి సత్తార్ ఫైజీ, ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి ఇలియాస్ బాషలు తెలిపారు. 28వ తేదీ గురువారం యోగివేమన విశ్వవిద్యాలయంలో, 29వ తేదీ శుక్రవారం కడప మున్సిపల్ ఉర్దూ బాలుర ఉన్నత పాఠశాలలో ఈ వాహనం ఉంటుందన్నారు. ఉర్దూ విద్యార్థులు, ఉపాధ్యాయులు, సాహితీ అభిమానులు సందర్శించి ఉర్దూ చరిత్ర, సంస్కృతి, సాహిత్యం, పరిశోధన పుస్తకాల పరిశీలించాలన్నారు.

సృజన వీచిక.. విజ్ఞాన వేదిక





నిర్వహణ కమిటీ సభ్యులకు సూచనలు ఇస్తున్న డిప్యూటీ ఈఓ రాజగోపాల్‌రెడ్డి



ప్రాజెక్టుల ప్రదర్శనకు గదుల్లో నంబరింగ్ ఇస్తున్న నిర్వహణ కమిటీ సభ్యులు

- రాష్ట్రస్థాయి సైన్సుఫేర్‌కు ఏర్పాట్లు పూర్తి
- నేడు, రేపు కడప సెయింట్ జోసెఫ్ కళాశాలలో నిర్వహణ
- రాష్ట్రవ్యాప్తంగా 26 జిల్లాల నుంచి రానున్న ప్రాజెక్టులు
- ప్రారంభ సభకు హాజరుకానున్న డిప్యూటీ సీఎం, ఎమ్మెల్యేలు

కడప ఎడ్యుకేషన్: కడప మరియపురం సెయింట్ జోసెఫ్ జూనియర్ కళాశాలలో ఈ నెల 28,29 తేదీలలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సైన్సుఫేర్‌కు సర్వం సిద్ధమైంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను విద్యాశాఖ అధికారులు సిద్ధం చేశారు. ఈ రాష్ట్ర స్థాయి సైన్సుఫేర్‌కు 26 జిల్లాల నుంచి 234 ప్రాజెక్టులు రానున్నాయి. ఇందులో వ్యక్తిగత విభాగం కింద 78 ప్రాజెక్టులు, గ్రూపు విభాగం కింద 78 ప్రాజెక్టులు, టీచర్ విభాగం కింద 78 ప్రాజెక్టులు ప్రదర్శనకు రానున్నాయి. విద్యార్థులు తమ సృజనాత్మకతను రంగరించి సిద్ధం చేసుకుని వచ్చిన ప్రాజెక్టులను ప్రదర్శించేందుకు వీలుగా మరియాపురం జూనియర్ కళాశాలలో తరగతుల వారీగా టేబుల్స్‌ను ఏర్పాటు చేశారు. ప్రాజెక్టుల ప్రదర్శనకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సర్వం సిద్ధం చేశారు. ఇతర జిల్లాల నుంచి రానున్న విద్యార్థులు, గైడ్ టీచర్లు బస చేసేందుకు వీలుగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

ప్రాజెక్టులను వీక్షించేందుకు వీలుగా...

రాష్ట్రస్థాయి సైన్సుఫేర్‌లో విద్యార్థులు తమ ప్రాజెక్టులను ప్రదర్శించిన వాటి గురించి వాటి పనితీరు గురించి పిల్లలకు వివరించనున్నారు. విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులను ఎంపిక చేసిన 15 మంది జ్యూరీ సభ్యులు పరిశీలించి ఆ ప్రాజెక్టులను మూల్యాంకనం చేసి సమాజానికి మంచి సందేశం ఇచ్చే 35 రకాల ప్రాజెక్టులను రీజనల్ స్థాయికి ఎంపిక చేయనున్నారు. ఇందులో వ్యక్తిగత విభాగం నుంచి 15 ప్రాజెక్టులు, గ్రూపు విభాగం నుంచి 10 ప్రాజెక్టులు, టీచర్ విభాగం నుంచి 10 ప్రాజెక్టులను రీజనల్ స్థాయికి ఎంపిక చేస్తారు. ఈ రీజనల్ స్థాయి పోటీలను విజయవాడలో జనవరి నెలలో నిర్వహించనున్నారు.

కార్యమానికి హాజరుకానున్న డిప్యూటీ సీఎం

రాష్ట్రస్థాయి సైన్సుఫేర్ ప్రారంభ కార్యక్రమానికి కళాశాల ఆవరణలో వేదికను సిద్ధం చేశారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం అంజద్‌బాషాతో పాటు జిల్లాకు సంబంధించిన పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కలెక్టర్ విజయరామరాజు హాజరుకానున్నారు. దీంతోపాటు కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ నుంచి అధికారులు, ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్ బండపల్లె ప్రతాప్‌రెడ్డి హాజరుకానున్నారు. సమావేశానంతరం విద్యార్థులు తమ తమ ప్రాజెక్టులను ప్రదర్శించనున్నారు.

అన్ని జిల్లాల నుంచి..



రాష్ట్రవ్యాప్తంగా 26 జిల్లాల నుంచి 234 ప్రాజెక్టులు రాష్ట్రస్థాయి సైన్సుఫేర్‌కు వస్తున్నాయి. విద్యార్థులు తమ తమ ప్రాజెక్టులను ప్రదర్శించేందుకు వీలుగా అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. అలాగే పిల్లలకు ప్రదర్శించిన ప్రాజెక్టులు వీక్షించేందుకు వీలుగా అన్ని ఏర్పాట్లు చేశాం. – మహేశ్వర్ రెడ్డి, జిల్లా సైన్సు అధికారి

ఏర్పాట్లు పూర్తి



రాష్ట్రస్థాయి సైన్సుఫేర్ కార్యక్రమానికి కమిటీలను ఏర్పాటు చేశాం. ఆ కమిటీ సభ్యులందరూ తమకు అప్పగించిన కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నారు. ప్రాజెక్టుల ప్రదర్శన కోసం అన్ని తరగతి గదులలో టేబుళ్లను కూడా ఏర్పాటు చేశాం. అలాగే ఇతర జిల్లాల నుంచి వచ్చే విద్యార్థులు, గైడ్ టీచర్స్ బస చేసేందుకు వీలుగా అన్ని ఏర్పాట్లను సిద్ధం చేశాం. – ఎద్దుల రాఘవరెడ్డి, డీఈఓ

అన్నీ సజావుగా జరిగేలా...



రాష్ట్రస్థాయి సైన్సుఫేర్‌లో ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సజావుగా జరిగేలా సూచనలు ఇచ్చాం. ఈ మేరకు ఎంఈఓలు, డిప్యూటీ ఈఓ, డీఈఓతోపాటు సైన్సుఫేర్ నిర్వహణకు కమిటీలు ఏర్పాటు చేశాం. ఎవరికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలను చేపట్టాం. – మార్తాల వెంకటకృష్ణారెడ్డి, పాఠశాల విద్య ఆర్‌జేడీ

టిష్యూకల్చర్ ల్యాబ్ ప్రారంభం

రైల్వేకోడూరు: మండలంలోని అనంతరాజుపేట వైఎస్సార్ హార్టికల్చర్ పరిశోధనా కేంద్రంలో బుధవారం టిష్యూ కల్చర్ ల్యాబ్‌ను వైస్ చాన్సలర్ జానకిరామ్, డైరెక్టర్ ఆఫ్ రీసర్చ్ డాక్టర్ నారం నాయుడు , రిజిస్టర్ బి.శ్రీనివాసులు, డాక్టర్ కరుణశ్రీ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైల్వేకోడూరు ప్రాంతంలో అత్యధికంగా అరటిని సాగు చేస్తున్న విషయాన్ని దృష్టిలో పెట్టుకుని ఆర్‌కేవీ నిధులు కోటిన్నర రూపాయలతో టిష్యూకల్చర్ ల్యాబ్‌ను ప్రారంభించామన్నారు. ఏడాదికి లక్షకు పైగా అరటి మొక్కలు ఉత్పత్తి చేసేందుకు కృషి చేస్తున్నామని వివరించారు. అలాగే ఎస్టీ, ఎస్సీ సబ్‌ప్లాన్ లో పుట్ట గొడుగుల పెంపకం, ఇన్‌పుట్స్‌పైన రైతులకు వివరించారు. అరటి ఉత్పత్తి దిగుబడిని పెంపొందించే లక్ష్యంతో ఈ ల్యాబ్‌ను ఏర్పాటు చేశామన్నారు. అసోసియేట్ డీన్ గోపాల్, ప్రొఫెసర్ సిహెచ్.రూత్ పాల్గొన్నారు.

టీడీపీ నేతల్లో ఓటమి భయం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

- ఇళ్ల పట్టాలపై నల్లారి కిషోర్‌వి అసత్య ఆరోపణలు
- ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

పీలేరు: వచ్చే ఎన్నికల్లో ఓటమి భయంతో టీడీపీ నాయకుడు కిషోర్‌కుమార్‌రెడ్డి ఇళ్లపట్టాలపై మతిలేని వ్యాఖ్యలు చేస్తున్నారని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి మండిపడ్డారు. బుధవారం స్థానిక మార్కెట్ యార్డులో విలేకరులతో మాట్లాడారు. పేదలకు ఇంటి పట్టాలు ఇవ్వడాన్ని జీర్ణించుకోలేని కిషోర్‌కుమార్‌రెడ్డి లేనిపోని ఆరోపణలు చేయడం సిగ్గు చేటన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పీలేరులో 12 వేల ఇళ్ల పట్టాలు ఇచ్చి, ఇళ్ల నిర్మాణాలకు తమ ప్రభుత్వం అండగా నిలిచిందని తెలిపారు. 'మీ సొంత గ్రామం పత్తేగడలో మీ ఇంటి పక్కనే ఎంపీ మిథున్‌రెడ్డి కోటి రూపాయలు పైగా వెచ్చించి స్థలాన్ని కొనుగోలు చేసి పేదలకు ఇంటి పట్టాలు ఇచ్చింది నిజం కాదా ?' అని ప్రశ్నించారు. అన్న కిరణ్‌కుమార్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు, కిషోర్‌కుమార్ రెడ్డి హౌసింగ్ బోర్డు ఛైర్మన్‌గా ఉన్నప్పుడు పీలేరులో పేదలకు ఎంత మందికి పట్టాలు ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. 2019 ఎన్నికల ముందు ఎలాగైనా గెలవాలనే దురుద్దేశంతో ఒక్క రూపాయి అకౌంట్‌లో వేసి ఇళ్లు మంజూరయ్యాయని బోగస్ పట్టాలు పంపిణీ చేసి పేదలను మోసం చేసింది మీరు కాదా ? అని ప్రశ్నించారు. జన్మభూమి కమిటీల పేరుతో మీ అనుచరులకు మేలు చేసుకోవడాన్ని అభివృద్ధి అంటారా అని ఎదురు ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన అనంతరం అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం పారదర్శకంగా పథకాలు అందిస్తోందని తెలిపారు. ఎలాంటి సిఫార్సులు, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా కుల మత రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. జగనన్న కాలనీల్లో టీడీపీ కార్యకర్తలకు సైతం ఇళ్లు మంజూరు చేసిన ఘనత తమదేనని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎంపీపీ సతీష్‌రెడ్డి, జెడ్పీటీసీ ఎ.టి. రత్నశేఖర్‌రెడ్డి, జెడ్పీ కోఆప్టెడ్ సభ్యుడు షఫీ, వైస్ ఎంపీపీ ఎన్.వి. చలపతి, మహితాఆనంద్, పెద్దోడు, ఉదయ్, కాలనీ చిన్న, అబీద్, షాకీర్, మునీర్, శ్రావణ్‌కుమార్‌రెడ్డి, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

మామిడి రైతు దిగాలు

- మామిడికి శాపంగా మారిన వాతావరణం
- సరైన చర్యలు చేపట్టకుంటే నష్టపోయే ప్రమాదం
- జిల్లాలో ఏటేటా పెరుగుతున్న మామిడి సాగు విస్తీర్ణం
- 40 వేల హెక్టార్లలో మామిడి తోటల సాగు

రాయచోటి : వాతావరణ మార్పులు ఫలరాజుపై పగబట్టాయి. డిసెంబర్‌లో మొదలైన చలి, సంక్రాంతి వరకు చుట్టుముట్టే పొగమంచు మామిడి తోటలపై తీవ్ర ప్రభావం చూపనున్నాయి. ఇప్పటికే పూత ఆలస్యం కావడంతోపాటు వచ్చిన పిందెలు కూడా రాలిపోతున్నాయి. ఉష్ణోగ్రతల్లో హెచ్చు తగ్గుల వల్ల పలు రకాల తెగుళ్లు సోకుతున్నాయి. ఈ పరిస్థితులన్నీ మామిడి రైతుకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఈ సమయంలో పూత, పిందెను కాపాడుకోకుంటే తీవ్రంగా నష్టపోయే అవకాశాలు ఉన్నాయి.

40 వేల హెక్టార్లకు పైగా మామిడి తోటల సాగు

అన్నమయ్య జిల్లాలో వరి, వేరుశనగ పంటలతో విసిగి వేసారిన రైతులు మామిడి తోటల సాగుపై మొగ్గు చూపారు. ఇప్పటికే అన్నమయ్య జిల్లా పరిధిలో 40 వేల హెక్టార్లకుపైగా వివిధ రకాల మామిడి తోటలను సాగు చేశారు. ఈ సాగు విస్తీర్ణం ఏటేటా పెరుగుతూ పోతోంది. మామిడి దిగుబడిపై గంపెడాశలు పెట్టుకున్న రైతులకు నిరాశే మిగిలేలా ఉంది. పూత, పిందెకట్టే సమయంలో వాతావరణంలో చోటు చేసుకున్న అనూహ్య మార్పులు తోటలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. సాధారణంగా డిసెంబర్ మొదటి వారంలోనే మామిడిలో పూత రావాల్సి ఉంది. కానీ ఇప్పటికీ సగానికిపైగా చెట్లు మొగ్గ కూడా కట్టకపోవడంతో దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపనుంది. చలి తీవ్రతలో హెచ్చు తగ్గులు, వాతావరణ మార్పులు పొగమంచు వల్లే పూత రావడం ఆలస్యమవుతుందని ఉద్యానశాఖ అధికారులు చెబుతున్నారు. మామిడిలో పూత రావడానికి, పిందెలు రాలకుండా ఉండటానికి తీసుకోవాల్సిన చర్యలను అధికారులు వివరిస్తున్నారు.

సూక్ష్మ పోషకాల వినియోగం

మామిడిలో పూత, పిందెలు బాగా రావడానికి జింక్, బోరాన్ లాంటి సూక్ష్మపోషకాలు సహకరిస్తాయి. ఆకుల్లో పచ్చదనం వృద్ధి చెందేందుకు జింక్ దోహదపడుతుంది. జింక్ లోపించిన మొక్కల్లో ఆకులు చిన్నగా మారి రెమ్మల ఎదుగుదల మందగిస్తుంది. ఫలితంగా మొక్కలు బలహీనపడతాయి. దీంతో పూతరాదు. ఇక బోరాన్ మామిడి పూత, పిందె రావడానికి సహాయపడుతుంది. పూగుత్తుల్లో పిందెకట్టే ద్విలింగ పుష్పాలు అధికంగా రావడానికి దోహదపడుతుంది. పూర్తిస్థాయిలో ఫలదీరణ జరిగి, పిందెలు అధికంగా ఏర్పడటానికి బోరాన్ ఉపయోగపడుతుంది. బోరాన్ లోపించిన చెట్లల్లో పిందె రాలడం ఎక్కువగా కనిపిస్తుంది. కాయలపై బుడిపెలు రావడం, బంక కారడం, పగుళ్లు ఏర్పడటం లాంటి లక్షణాలు కూడా ఉంటాయి. దీనిని నివారించడానికి జింక్, బోరాన్ ఉండే సూక్ష్మపోషకాల మిశ్రమాన్ని మామిడి చెట్లపై పిచికారీ చేయాలి. పూత ఆలస్యమైన తోటల్లో పూమొగ్గలను ఉత్తేజపరిచేందుకు లీటర్ నీటిలో 10 గ్రాములు మల్టీ కె (పొటాషియం నైట్రేట్), 5 గ్రాములు యూరియా చొప్పున కలిపి రెమ్మలు తడిచేలా పిచికారీ చేయాలి. యూరియా, మల్టీకెలోని నత్రజని, పొటాష్ కలిసి పూ మొగ్గలను ఉత్తేజపరుస్తాయి. పూత బాగా రావడంతోపాటు పిందె కట్టడానికి, కాయలు నాణ్యంగా ఎదగడానికి సహకరిస్తాయి. పిందె రాలడాన్ని అరికట్టడానికి 10 లీటర్ల నీటిలో 2 మిల్లీలీటర్లు ప్లానోఫిక్స్ కలిపి పూరెమ్మలు మొత్తం తడిచేలా పిచికారీ చేయాలి. వర్షాభావంతో ఎరువులు వేయలేకపోయిన రైతులు పిందె దశలో ద్రావణాన్ని పిచికారీ చేయాలి. పూత ఆలస్యమైన తోటల్లో కాయ పెరుగుదల సమయంలో డ్రిప్ ద్వారా నీరు అందించాలి.

తెగుళ్లతోనూ తీవ్ర నష్టం

జనవరి, ఫిబ్రవరిలో చలి తీవ్రత వల్ల తోటల్లో తెగుళ్లు, చీడపీడల ఉధృతి పెరిగింది. తేనెమంచు, బూడిద తెగులు, రసం పీల్చే పురుగులు అధికంగా కనిపిస్తాయి. ఇవి పూత, పిందె, కాయ దశల్లో చెట్లను ఆశించి ఎక్కువగా నష్టపరుస్తాయి. ప్రస్తుతం మామిడి పంటలో తేనెమంచు పురుగు, తామర పురుగులు, బూడిదె తెగులు ఉధృతి ఎక్కువగా ఉంది. నివారణ చర్యలు చేపట్టడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చు.

తేనెమంచు పురుగు నివారణకు లీటర్ నీటిలో 1 మిల్లీ లీటర్ ల్యాండ్‌సైహలొత్రిన్ లేదా 2.5 మిల్లీ లీటర్లు మోనోక్రోటోఫాస్ చొప్పున కలిపి పూత మొదలయ్యే, పిందెలు తయారయ్యే సమయాలలో పూత ఆకులతోపాటు మొదళ్లు, కొమ్మలపై పిచికారీ చేయాలి. అయితే పూత పూర్తిగా విచ్చుకోకముందే ఈ ద్రావణాన్ని పిచికారీ చేయాలి. మొగ్గ దశలో ఉన్న తోటల్లో తేనెమంచు పురుగులు కనిపిస్తే లీటర్ నీటిలో 0.5 మిల్లీ లీటర్లు కాన్ఫిడార్ లేదా 0.5 గ్రాములు థయోమిథాక్సామ్ (అక్టారా) కలిపి పిచికారీ చేయాలి. తోటలో నీరు నిల్వ లేకుండా చేయడం ద్వారా వీటి ఉధృతిని తగ్గించవచ్చు.

తామర పురుగు నివారణకు పిందెలు ఎదిగే (నల్ల పూత) దశలో లీటర్ నీటిలో 1.5 మిల్లీ లీటర్ టర్మిడాల్ కలిపి పిచికారీ చేయాలి. పూ మొగ్గ (తెల్లపూత) దశలో ఉన్నట్లయితే లీటర్ నీటిలో 1 మిల్లీ లీటర్ ల్యాండసైహలో త్రిన్ కలిపి పిచికారీ చేసుకోవాలి.

బూడిద తెగులు నివారణకు లీటర్ నీటిలో 3 గ్రాములు నీటిలో కరిగే గంధకం (సల్ఫర్) లేదా 2 మిల్లీ లీటర్ల హెక్సాకొనజోల్ (కాన్టాప్ ప్లస్) కలిపి పిచికారి చేయాలి.

కవర్లు కట్టుకోండి



మొగ్గ దశలో ఉన్న మామిడి చెట్లకు మందులు పిచికారీ చేస్తున్న రైతులు

మామిడిలో దిగుబడి పెంచడానికి కాయలకు కవర్ కట్టడం మంచి పద్ధతి. మ్యాంగో ఫ్రూట్ ప్రొటెక్షన్ బ్యాగు కట్టడం వల్ల కాయలు అధిక బరువు పెరగడంతోపాటు చీడ పీడల నుంచి రక్షణగా ఉంటుంది. చెట్టుపై ఉన్న మామిడి కాయ కోడుగుడ్డు సైజులో ఉన్నప్పుడే ఒక్కో కాయకు ఒక్కో కవర్ కట్టాలి. అంతకుముందే కాయలను గుడ్డతో శుభ్రంగా తుడవాలి. కాయ కింది భాగం నుంచి తొడిమ పైభాగంలో 3 సెంటీమీటర్లపైన కవర్‌ను కట్టాలి. దీనివల్ల తొడిమ వద్ద నల్లగా మసిపట్టడం, పురుగు పట్టడం, సొన కారడం లాంటివి నిరోధించవచ్చు. గాలిదుమారం వచ్చినప్పుడు కాయ రాలకుండా ఉంటుంది. వడగండ్ల వానతో కాయ పాడవదు. కాయలకు పురుగు మందులు పిచికారీ చేయాల్సిన అవసరం కూడా ఉండదు. చెట్టుమీదనే సహజ సిద్ధంగా పండుతాయి. మామూలు కాయ కంటే అదనంగా 100 గ్రాముల వరకు బరువు పెరుగుతుంది.

ఇదే కీలకం



ప్రస్తుత పూత, పిందెలు వచ్చే కీలక దశలో సరైన జాగ్రత్తలు తీసుకుంటే అధిక దిగుబడులు పొందవచ్చు. వాతావరణ మార్పుల వల్ల మామిడికి పలు రకాల తెగుళ్లు సోకుతున్నాయి. వీటి నివారణకు సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. మామిడి పూత, కాయ నాణ్యత మెరుగుపరచడానికి స్థూల పోషకాలతో జింక్, బోరాన్, మాంగనీస్, ఐరెన్ లాంటి సూక్ష్మపోషకాల అవసరం ఎంతో ఉంటుంది. అవసరాన్ని బట్టి ఆయా పోషకాల మిశ్రమాలను పిచికారీ చేయాలి.

– రవీంద్ర బాబు, ఉద్యానవన జిల్లా అధికారి (అన్నమయ్య జిల్లా)

అప్రమత్తత అవసరం



మామిడి తోటల్లో పూత సమయం, కాయ దశే అత్యంత ముఖ్యమైంది. ఇప్పుడు అప్రమత్తంగా లేకుంటే దిగుబడిపై తీవ్ర ప్రభావం పడుతుంది. పూత, పిందె రాలకుండా సరైన జాగ్రత్తలు పాటించాలి. డిసెంబర్, జనవరి నెలల్లో చలి తీవ్రత వల్ల పూత రావడం ఆలస్యమైంది. వచ్చిన పిందెలు కూడా రాలిపోతున్నాయి. ఈ సమస్య నుంచి గట్టెక్కేందుకు కావాల్సిన సూక్ష్మపోషకాలను ఎప్పటికప్పుడు అందిస్తూ ఉండాలి. చలి, మంచు అధికంగా ఉండడంతో చీడపీడలు ఆశిస్తున్నాయి. ప్రస్తుతం తేనెమంచు, బూడిద తెగులు, రసం పీల్చే పురుగులు కనిపిస్తున్నాయి.

– నాగమణి, ఉద్యానవనశాఖ అధికారి (రాయచోటి)

క్లుప్తంగా

మహిళ ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న వాణి

కలకడ : మనస్థాపానికి గురై మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన కలకడ మండలం, నవాబుపేట పంచాయతీ చావిడికాడపల్లెలో జరిగింది. హెడ్‌కానిస్టేబుల్ రెడ్డిబాబు కథనం మేరకు.. చావిడికాడపల్లెకు చెందిన సుధాకర్ భార్య ఎ.వాణి (45) మంగళవారం సాయంత్రం ఇంటి వద్ద కుటుంబ సభ్యులతో మనస్పర్థల కారణంగా మనస్థాపానికి గురైంది. ఈ నేపథ్యంలో ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే కలికిరి మండలం, మహల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అదేరోజు రాత్రి మృతిచెందింది. బుధవారం మృతురాలి భర్త సుధాకర్ కలకడ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతురాలికి భర్త, ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ మృతి

కేవీపల్లి : ఈ నెల 20న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ జయమ్మ (55) బుధవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మండలంలోని చింతమాకులపల్లె వద్ద ఈ నెల 20న ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొన్న ప్రమాదంలో జిల్లేళ్లమంద పంచాయతీ బసన్నగారిపల్లెకు చెందిన చిన్నసిద్దయ్య (62) అక్కడికక్కడే మృతి చెందగా ఆయన భార్య జయమ్మ తీవ్రంగా గాయపడింది. వారం రోజులుగా తిరుపతిలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జయమ్మ బుధవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

నవశకం



వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. అస్తవ్యస్తంగా ఉన్న సర్కారు బడుల రూపురేఖలు మార్చేశారు.. పేదలకు సొంతింటి కల సాకారం చేస్తున్నారు. సచివాలయాల ద్వారా క్షణాల్లో ప్రతి పని జరుగుతోంది. ఫలితంగా పేదల బతుకులు బాగుపడ్డాయని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

– సాక్షి నెట్‌వర్క్

కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు మంజూరయ్యాయి



మా గ్రామ వలంటీర్ వచ్చి నాకు సంబంధించిన ఆధార్ కార్డు, రేషన్ కార్డు తీసుకెళ్లి వారం రోజులు మా గ్రామంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో నాకు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు ఉచితంగా అందజేశారు. గత టీడీపీ ప్రభుత్వంలో తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగాను. జగనన్న వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసి నాకు శ్రమ లేకుండా ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాను.

– జనార్దన్, రెడ్డిపల్లి, పుల్లంపేట మండలం

విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమం ప్రవేశపెట్టి పేద పిల్లలు ప్రపంచ స్థాయి పోటీని తట్టుకునేలా తీర్చిదిద్దుతున్నారు. 3, 4, 5వ తరగతుల విలీనం ద్వారా సబ్జెక్టుల వారి టీచర్లు, డిజిటల్ విద్యా విధానం కోసం తరగతి గదుల్లో ఐఎఫ్‌బీ, టీవీ స్క్రీన్లు ఏర్పాటు చేశారు. వీటిలో ఉంచాల్సిన పాఠ్యాంశాలు, బైజూస్ ట్యాబ్‌ల వినియోగం, బాలికలు పాఠశాలకు గైర్హాజరు కాకుండా స్వచ్ఛ పథకం ద్వారా నాప్‌కిన్స్ అందజేత, విద్యార్థులకు రాగిజావ, జగనన్న విద్యాకానుక, నాడు–నేడు ద్వారా విద్యార్థులకు అద్భుతమైన ఆహ్లాదకరమైన పాఠశాల వాతావరణం ఏర్పడడమే కాకుండా ఉత్తమ బోధన లభిస్తోంది.

– చప్పిడి పద్మజ, ఉర్దూ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు, చిన్నమండెం

విడాకులిచ్చిన భార్యపై దాడి

మదనపల్లె : విడాకులు తీసుకుందన్న కోపంతో భర్త భార్యపై దాడిచేసేందుకు వెళ్లిన ఘటనలో అడ్డువచ్చిన స్నేహితురాలు తీవ్రంగా గాయపడిన ఘటన బుధవారం మదనపల్లెలో జరిగింది. పట్టణంలోని అప్పారావుతోటలో నివాసం ఉంటున్న ఎస్.ఫర్హానా(28) స్థానికంగా ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో హెడ్‌నర్స్‌గా పనిచేస్తోంది. ఆమెకు భర్త ఇర్ఫాన్‌తో మనస్పర్థలు రావడంతో విడాకులకు దరఖాస్తు చేసుకుని వారం క్రితం కోర్టు నుంచి విడాకులు పొందింది. దీంతో భార్యపై కోపం పెంచుకున్న భర్త ఇర్ఫాన్ తన స్నేహితుడు రఫీతో కలసి ఆమె పనిచేస్తున్న ఆస్పత్రికి వెళ్లి ఆమెపై దాడికి ప్రయత్నించాడు. అదే ఆస్పత్రిలో హెడ్‌నర్స్‌గా పనిచేస్తూ, ఫర్హానాకు స్నేహితురాలైన సుమినా... ఇర్ఫాన్ దాడిచేయడాన్ని గమనించి అడ్డుకునేందుకు వెళ్లింది. ఈక్రమంలో భార్యను కొట్టేందుకు తీసుకువచ్చిన రాయితో సుమినాను ఇర్ఫాన్ కొట్టాడు. దీంతో ఆమె తలకు గాయమై తీవ్రంగా గాయపడింది. వెంటనే స్థానికులు ఆమెను ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్స అందజేశారు. దాడి విషయమై ఫర్హానా టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

రమణీయం.. రథోత్సవం

- ముగిసిన కాశినాయన ఆరాధన మహోత్సవాలు
- కాశినాయన జ్యోతిని చూసి తరించిన భక్తులు



రథోత్సవంలో పాల్గొన్న భక్తజన సందోహం

కాశినాయన : శ్రీఅవధూత కాశినాయన 28వ ఆరాధన మహోత్సవాలు బుధవారం వైభవంగా ముగిశాయి. అధిక సంఖ్యలో భక్తులు ఆరాధన మహోత్సవాల్లో పాల్గొని కాశినాయన సమాధిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తుల కోసం అన్నదానం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి కాశినాయన సమాధిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కాశినాయన రథోత్సవంలో పాల్గొన్నారు. మంగళవారం అర్ధరాత్రి 12–30 గంటలకు కాశినాయన జ్యోతి స్వరూపం దర్శనమిచ్చింది. ఆకాశంలో కాశినాయన జ్యోతిని చూసి భక్తులు పునీతులయ్యారు. అనంతరం కాశినాయన ఉత్సవ విగ్రహాన్ని గ్రామోత్సవం నిర్వహించారు. మహిళలు ప్రమిదలతో దీపాలను వెలిగించుకుని గ్రామోత్సవంలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. అలాగే కాశినాయన మాల ధరించిన భక్తులు దివిటీలు చేతబూని రథోత్సవంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఆరాధన మహోత్సవాలకు 140 క్వింటాళ్లకు పైగా బియ్యం ఖర్చు కాగా అంతకు రెట్టింపు బియ్యాన్ని భక్తులు సమర్పించారు. అధిక మొత్తంలో నగదును కూడా సమర్పించుకున్నారు. కాశినాయన గ్రామోత్సవం అనంతరం కాశినాయన విగ్రహానికి పవళింపుసేవ నిర్వహించారు. ఆరాధన మహోత్సవాలు వైభవంగా జరిగేందుకు ప్రజలందరూ సహకరించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. సజావుగా ఆరాధన ముగిసిందని ఆలయ కమిటీ తెలిపింది.

కారు, బైకు ఢీ

ప్రొటెక్షన్ వాచర్ మృతి



గోపాల్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

రామాపురం : రామాపురం – లక్కిరెడ్డిపల్లె రహదారిలోని సుద్దమళ్ల క్రాస్ రోడ్డు సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రొటెక్షన్ వాచర్ గోపాల్(35) మృతి చెందాడు. ఎస్‌ఐ కొండారెడ్డి వివరాల మేరకు.. మండలంలోని సుద్దమళ్ల పంచాయతీ బయారెడ్డిగారిపల్లె ఎగువ హరిజనవాడకు చెందిన గోపాల్ అటవీశాఖలో ప్రొటెక్షన్ వాచర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. రాయచోటి రేంజ్ కార్యాలయం పరిధిలోని నగరవనంలో విధులు ముగించుకొని బైకుపై ఇంటికి బయలుదేరాడు. సుద్దమళ్ల క్రాస్ రోడ్డు సమీపానికి రాగానే లక్కిరెడ్డిపల్లె వైపు నుంచి రామాపురం వైపు వెళ్తున్న ఏపీ37ఏడబ్ల్యు 4445 గల స్కార్పియో వాహనం బైకును ఢీకొంది. ఈ ప్రమాదంలో గోపాల్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న మండల పోలీసులు, ఫారెస్టు సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.

ఎర్రచందనం దుంగలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న దుంగలు, నిందితుడితో అటవీ అధికారులు

రామాపురం : పాలకొండలు ప్రాంతంలోని కోర్తిమడుగు బీటులో కోర్తిపెంట వద్ద అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉంచిన 9 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు వంగిమళ్ల బీటు సెక్షన్ ఆఫీసర్ భరణి కుమార్ తెలిపారు. అలాగే ఒక కూలీని అరెస్టు చేశామన్నారు. ఆయన కథనం మేరకు.. తమకు ముందస్తు సమాచారం రావడంతో దాడి నిర్వహించి 260 కేజీల బరువు గల 9 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నామన్నారు. తమిళనాడు రాష్ట్రం తిరువణ్ణామలైకు చెందిన కృష్ణమూర్తి అనే కూలీని అరెస్టు చేసి తిరుపతిలోని ఎర్రచందనం కోర్టులో హాజరు పరిచామన్నారు. ఎర్రచందనం దుంగల విలువ రూ.1,21,459 ఉంటుందన్నారు. దాడిలో బీట్ అధికారులు మహబూబ్‌బాషా, బేస్‌క్యాంప్ సిబ్బంది గుర్రయ్య, ఖాదర్‌వలీ, శీను, రెడ్డయ్య, రమణ, కేశవులు పాల్గొన్నారు.

సారా విక్రేత అరెస్టు

నిమ్మనపల్లె : సారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. బుధవారం మండలంలోని కొండయ్యగారిపల్లె పంచాయతీ కొమ్మిరెడ్డిగారిపల్లె సమీపంలో అదే గ్రామానికి చెందిన గుర్రంకొండ వెంకటస్వామి(63) సారా విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడిచేసి అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. నిందితుడి వద్దనుంచి 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారన్నారు.

మోటార్ బైక్‌లు ఢీ

కమలాపురం : కడప–తాడిపత్రి ప్రధాన రహదారిలోని పాపాఘ్ని నదిపై ఉన్న అప్రోచ్ రోడ్డుపై బుధవారం రాత్రి రెండు మోటార్ బైకులు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఏడాదిన్నర వయస్సున్న చిన్నారి ఆరాధ్య తలకు తీవ్ర గాయాలయ్యాయి.